క్లుప్తంగా

హ్యాపీ అవర్స్‌డే


విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ రమణ

సింహాద్రిపురం : ఈనెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక కేజీబీవీలోని విద్యార్థులకు ఆదివారం హ్యాపీ అవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రమణ, ఎస్‌ఐ తులసినాగప్రసాదులు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు కష్టపడితే ఎదైనా సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఖాదర్‌వల్లి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

ముద్దనూరు : మండలంలోని గంగాదేవిపల్లె సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో స్కూటరిస్టు లోకేశ్వరరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని మంగపట్నం గ్రామానికి చెందిన లోకేశ్వరరెడ్డి స్కూటర్‌పై ప్రయాణిస్తుండగా వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అతనికి ముఖము, కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా తోటంశెట్టి


తోటంశెట్టి చంద్రశేఖర్‌ను

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవాసవి కన్యాకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్యవైశ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య నూతన అధ్యక్షుడిగా తోటంశెట్టి చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా రాయవరం వెంకసుబ్బారావు ఎన్నికయ్యారు. ఈనెల 9న నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మహేష్ భృంగి

కమలాపురం : స్థానిక స్వామి వివేకానంద హైస్కూల్‌లో మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం కడప నగరంలోని ప్రైమ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 210 మంది రోగులకు వైద్యులు మహేష్ భృంగి, జాకోబ్, షాహిస్తాలు పరీక్షించి వైద్య సేవలు అందజేశారు. ఎముకలు, నరములకు సంబంధించిన పరీక్షలను ఉచితంగా చేశారు. అలాగే మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని తమ ప్రైమ్ హాస్పిటల్‌లో ఆరోగ్య శ్రీ, ఈహెచ్‌సీ కార్డులున్న వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, మదర్ థెరిసా సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా అర్చక సహ ప్రముఖ్‌గా విజయ్‌భట్టర్

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా మందిర అర్చక పురోహిత సహ ప్రముఖ్‌గా కడప గడ్డిబజారు లక్ష్మిసత్యనారాయణస్వామి ఆలయ ప్రధాన అర్చకులు విజయభట్టర్ నియమితులయ్యారు. నంద్యాల భరతమాత ఆలయ ప్రాంగణంలోని పుల్లారెడ్డి భవనంలో విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ప్రసార ప్రచార సహ ప్రముఖ్‌గా సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, భజరంగదళ్ సహ సంయోజకులుగా నాగిరెడ్డి, మహేశ్వరరెడ్డి, దివాకర్, ప్రాంత దుర్గా వాహిని సంయోజిగా ముమ్మడి మేఘనారెడ్డి, జిల్లా సత్సంగ సహ ప్రముఖ్‌లుగా క్రిష్టిపాటి చిన్న బసిరెడ్డి, శ్రీధర్, జిల్లా సహ కార్యదర్శులుగా విశ్వనాథరెడ్డి, త్రివిక్రమ్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో నందారపు చెన్న కృష్ణారెడ్డి, కొండపల్లి వెంకట సుభాష్‌కుమార్, వెంకట్రామిరెడ్డి, మాలినీరెడ్డి, మనోహర్ రెడ్డి, రమణరావు, రామమహేష్, అమర్నాథ్ శెట్టి చంటి, సంజీవరాజు , సురేంద్రలు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

కడప కల్చరల్: పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కడప నగరం అల్మాస్‌పేటలోని జామియా తుస్సాలిహత్ మదరసాలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పలువురికీ బియ్యం ప్యాకెట్లు, సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు సభ్యులు మౌలానా దావూద్ బాక్వి సాహెబ్, ప్రముఖులు అఫ్సర్‌ఖాన్, సయ్యద్ అహ్మద్‌బాషా వారు మాట్లాడుతూ కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఈ ఏడాది 215 మంది పేదలకు రేషన్ కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. డాక్టర్ ఎఫ్ఎం ముక్తార్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

రబీలో నువ్వుల పంట సాగు

- పంట సాగులో పెరిగిపోతున్న పెట్టుబడులు
- తెగుళ్ల నివారణకు మందుల పిచికారి
- దిగుబడులపై సన్నగిల్లుతున్న ఆశలు


నువ్వుల పంటకు మందు పిచికారి చేస్తున్న రైతు


పంటకు నీటి తడులు అందిస్తున్న రైతు


గొందిపల్లె వద్ద సాగులో ఉన్న నువ్వుల పంట

వేముల : ఈ ఏడాది రబీలో నువ్వుల పంటను రైతులు సాగు చేసుకున్నారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు బోరుబావుల కింద పంటను సాగు చేశారు. వ్యవసాయ పంటల్లో సున్నితమైన పంట నువ్వుల పంట. పంట సాగు చేసిన మొదలు దిగుబడులు వచ్చే వరకు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా రైతులు నష్టాలనే ఎదుర్కొంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, చీడ పీడలు పంటను దెబ్బతీస్తున్నా రైతు మొక్కవోని ధైర్యంతో మందులు పిచికారి చేస్తూ నివారిస్తున్నారు. ఏ పంట సాగు చేసినా నష్టాలే తప్ప ఆదాయం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయంలో సాగు చేసిన పంటలలో దిగుబడులు వస్తే ధరలు లేక.. ధరలు ఉంటే దిగుబడులు రాక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

పంట సాగులో పెరిగిపోతున్న పెట్టుబడులు :
ఏ పంట సాగు చేయాలన్న పెట్టుబడులు మాత్రం తగ్గడంలేదు. ఈ ఏడాది నువ్వుల పంటలో ఎకరాకు రూ.15 వేలకుపైనే పెట్టుబడులు పెట్టారు. పంట సాగు చేయాలంటే సేద్యాలు, ఎరువులు, విత్తనాలు, విత్తన ఖర్చులు, కూలీ ఖర్చులు అధికమవుతున్నాయి. ఒకసారి పంట దెబ్బతింటే పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొంటోంది. ఖరీఫ్, రబీ సీజన్లలో పంట సాగులో దిగుబడులు వచ్చి ధరలు ఉన్నట్లయితే వ్యవసాయం గిట్టుబాటు అవుతోందని రైతులు అంటున్నారు. ప్రతి ఏడాది ఒక సీజన్‌లో పంటలు పండితే.. మరో సీజన్‌లో పంటలు పండక నష్టపోవాల్సి వస్తోందన్నారు. పంటలు సాగు చేశాక వాటి సంరక్షణే భారంగా మారుతోంది. దీంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని రైతులు అంటున్నారు.

తెగుళ్ల నివారణకు మందుల పిచికారి
పంట సాగు చేశాక వాటి సంరక్షణపట్ల రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రతి పంటకు తెగుళ్ల సోకుతున్నాయి. నువ్వుల పంటలో ముందు జాగ్రత్తగా మందులు పిచికారి చేస్తున్నారు. నువ్వుల పంట సాగు చేశాక 15 రోజుల నుంచే మందులు పిచికారి చేశారు. పంటలో దిగుబడులు అందే సమయానికి ఐదుసార్లు మందులు పిచికారి చేస్తున్నామని రైతులు అంటున్నారు. కేవలం మందుల పిచికారి చేసేందుకు ఎకరాకు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు అదనంగా ఖర్చు చేస్తున్నారు. పంట పూత దశలో ఉన్న సమయంలో వాతావరణ మార్పులు పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి.

దిగుబడులపై సన్నగిల్లుతున్న ఆశలు
పంట సాగు చేసిన 80 రోజులకే దిగుబడులు అందుతాయి. ఈ ఏడాది నువ్వుల పంటపై రైతులు పెట్టుకున్న ఆశలన్ని అడియాశలయ్యాయి. మామూలుగా అన్ని అనుకూలిస్తే నువ్వుల పంటలో ఎకరాకు ఐదారు క్వింటాళ్ల దిగుబులు రావాలి. అయితే ఈ సారి ఎకరాకు 3 క్వింటాళ్లకు మించి దిగుబడులు రావని రైతులు అంటున్నారు. పంట సాగు చేశాక ఫిబ్రవరి నెలలో కూడా రాత్రివేళలో చలి ఉండటం పంటపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం పంట పూత, కాయ దశలో ఉంది. మరో 20 రోజులలో పంట కోత కోయాల్సి ఉంది. ముందుగా సాగు చేసిన తోటలలో మరో వారంలో పంట కోత కోయనున్నారు.

నువ్వుల పంట గిట్టుబాటు కావడంలేదు



ఈ ఏడాది నువ్వుల పంట గిట్టుబాటు కావడంలేదు. ఈ ఏడాది చలి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. సాగులో పెట్టుబడులు పెట్టిన ఆశించిన మేర ఆదాయం లేదు. నాకున్న 4 ఎకరాలలో నువ్వుల పంటను సాగు చేశా. సాగులో రూ.60 వేలకుపైనే పెట్టుబడులు పెట్టా. దిగుబడులు లేక సాగులో నష్టాలు వస్తున్నాయి.
– చలపతి, రైతు, వేముల

ఆశించిన మేర దిగుబడులు లేవు



నువ్వుల సాగులో ఆశించిన మేర దిగుబడులు లేవు. ఎకరాకు 3 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి లేదు. పంటను జాగ్రత్తగా కాపాడుకున్న వాతావరణ పరిస్థితులు పంటను దెబ్బతీశాయి. తెగుల్లు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. అయినా సాగులో దిగుబడులు లేక నష్టపోతున్నాం.
– రాఘవరెడ్డి, రైతు, గొందిపల్లె

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపం 33–11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ కింద ఉన్న ట్రాన్స్ పార్మర్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గంగిరెడ్డి ఆసుపత్రి ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినయోగదారులు సహకరించాలన్నారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఏర్పాట్లు


విగ్రహ ప్రతిష్టకు ముస్తాబవుతున్న అంకమ్మతల్లి దేవస్థానం

ఎర్రగుంట్ల : పట్టణంలోని నడివూరులో నూతనంగా నిర్మించిన శ్రీ మహా అంకమ్మతల్లి (పార్వతిదేవి) దేవస్థానం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈనెల 4, 5, 6 తేదీలలో జరుగుతుందని అందుకు అన్ని ఏర్పాట్లు ఆలయ నిర్వాహకులు చేపట్టారు. అంకమ్మతల్లి, గణపతి, సుబ్రమణ్య, సింహవాహనం, ధ్వజ శిఖర కలిశ స్థాపనలు నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. 6వ తేదీ ఒంగోలు జాతి సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలు కడప రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జరుగుతాయన్నారు. మొదటి బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.25 వేలు, నాలుగవ బహుమతి రూ.20 వేలు ఉంటాయన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు దొంగతనాల పట్ల అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కమలాపురం : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పట్టణంలో ప్రజలకు దొంగతనాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో తాళం వేసి వెళ్లిన ఇళ్లలో దొంగతనాలు అధికం అయ్యాయన్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో చాలా మంది బయట నిద్రిస్తుంటారని, ఆ సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు విలువైన ఆభరణాలు, నగదు ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్ర పరచుకోవాలని సూచించారు. అలాగే ఇళ్లకు తాళం వేసి ఊర్లకు వెళ్లే వారు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి ఇళ్లపై పోలీస్ నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పోలీస్ శాఖ ఉచితంగా అందిస్తున్న ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొలం పనులకు, వాకింగ్‌కు, పశువులు మేపు కోవడానికి వెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు ధరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒక వేళ ఆభరణాలు ధరిస్తే అవి కనబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మీ కాలనీల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కమలాపురం ఎస్‌ఐ 91211 00532, సీఐ 91211 00529 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అలాగే స్థోమత ఉన్న వారు మీ ఇళ్లల్లో లేదా ఐదారు మంది కలసి వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మీ వీధుల్లో ఎవైన సంఘటనలు జరిగితే సీసీ కెమెరాల ఫుటేజీ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా కొత్తపేట గంగమ్మతల్లి తిరునాల


భక్తులకు మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకుడు


కల్యాణాన్ని వీక్షిస్తున్నభక్తులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం గంగమ్మతల్లి, శివాంశ సంభూతుడైన కాటమరాజు కల్యాణాన్ని అర్చకులు రామకృష్ణ కన్నుల పండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ముత్యాల తలంబ్రాలను పంచిపెట్టారు. భక్తులు గంగమ్మతల్లికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో కలిసి విందుభోజనాల చేశారు. కోలాటాలు, చెక్కభజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గంగమ్మతల్లి ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు తగిన వసతులు, సౌకర్యాల ఏర్పాట్లను ఆలయ ఈఓ కృష్ణాణ్ణాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. చింతకొమ్మదిన్నె పోలీసులు బందోబస్తు నిర్వహించి పర్యవేక్షించారు.


కోలాటం నిర్వహిస్తున్న చిన్నారులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయండి

ఎర్రగుంట్ల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పున: ప్రారంభిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు పని భద్రత, ఆరోగ్య, భద్రత లేక దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా సంక్షేమ బోర్డు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యాక్షుడు చాంద్‌బాషా, సీపీఐ మండల కార్యదర్శి భవానిశంకర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపవాసం పాటించాలి

జమ్మలమడుగు : రంజాన్‌మాసంలో ఉపవాసాలు ప్రతి ముస్లిం పాటించాలని పీఠాధిపతులు సయ్యద్ షా గౌసపీరాఖాద్రీ, సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీలు తెలిపారు. ఆదివారం రంజాన్ మాసం ఉపవాస దీక్ష ప్రారంభించి సాయంత్రం ఉపవాస దీక్షలను విరమించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడాదిలో ఒకసారి వచ్చే రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరు తమ శక్తి కొలది దానధర్మాలు చేయడంతో పాటు నిరుపేదలను ఆదుకోవాలని సూచించారు. ఉపవాస దీక్షలకు ఇంట్లో సౌకర్యంలేని వారు ఆస్థానయే గౌసియాలో, జామియా మసీదులలో ఉపవాస దీక్షలు ప్రారంభించేవారికి సహేరిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ముస్లిం కచ్చితంగా ఉపవాస దీక్ష నియమాలు పాటించాలని వారు సూచించారు.

కనీస మద్దతు ధరను కల్పించాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి

ఎర్రగుంట్ల : రైతులకు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. అదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పప్పుశనగలకు మద్దతు ధర రూ.6338 క్వింటాకు అందించాలన్నారు. దీనిపై సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నామని రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ డి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుప్పలతో ప్రమాదకరంగా ప్రయాణం


పులివెందుల రహదారిలో ప్రమాదకరంగా ఎర్రమట్టి నిల్వ

ముద్దనూరు : ముద్దనూరు–పులివెందుల ప్రధాన రహదారిలో మట్టికుప్పలతో ప్రయాణికులు ఇక్కట్ల పాలవుతున్నారు. సుమారు వారం రోజుల క్రితం రహదారి మరమ్మతుల్లో భాగంగా ప్రధాన రహదారికి ఇరువైపులా ఎర్రమట్టిని నిల్వ చేశారు. దీంతో ఈ రహదారిలో ప్రయాణించే ప్రయాణికులకు, వాహనాలకు ఈ మట్టి కుప్పలు ప్రమాదకరంగా మారాయి. వాహనాలు సంచరించే సమయంలో ఎర్రమట్టి పైకి ఎగిసిపడుతుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, ద్విచక్ర వాహనాల ప్రయాణికులకు కళ్లలో మట్టి పడుతుండడంతో ప్రయాణం ప్రమాదంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారి పనులు జరిగేటంతవరకు కనీసం మట్టి ఎగిసి పడకుండా మట్టిని నీటితోనైనా తడిపిప్రయాణికులకు ఇబ్బంది పడకుండా చూడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

పోరాటంతోనే 'ఆశా'లకు న్యాయం

కడప వైఎస్సార్ సర్కిల్: ఏఐటీయూసీ పోరాటాలతోనే ఆశా కార్యకర్తలకు న్యాయం జరిగిందని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షురాలు యు.మరియమ్మ పేర్కొన్నారు.

ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు గ్రాట్యూటీ రూ. 1.50 లక్షల వరకు లబ్ధి చేకూర్చడం మంచిదే అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఆశాలకిచ్చే వేతనాలు సరిపడలేదని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉచితంగా రూ.10 లక్షల బీమా, హెల్త్ కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక శోభ



కోలాట నృత్యంలో చిన్నారులు

పులివెందుల టౌన్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీపతి చిన్న బాలుడు సహకారంతో పులివెందుల శ్రీరాజా కళా నిలయం డ్యాన్స్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో వారి చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు.

4న రాష్ట్ర బడ్జెట్‌పై సదస్సు

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ఆర్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4న సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం కోసం సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


దంపతులను ఆశీర్వదిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

వీరపునాయునిపల్లె : ఎర్రగుంట్ల మండలం చిలంకూరులోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి పాల్గొని నూతన వధూవరులు వీరపునాయునిపల్లె మండలం వెల్దుర్తి గ్రామ సర్పంచ్ విశ్వనాథ్, స్వరూపరాణిలను ఆశీర్వదించారు. భైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, వీరపునాయునిపల్లె మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కమలాపురం ఉప మండలాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, కమలాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రాజుపాలెం సుబ్బారెడ్డి నాయకులు ఆయన వెంట ఉన్నారు.

గాడిద పాలు గరిటడైనను చాలు


పులివెందులలో గాడిద పాలను అమ్ముతున్న వ్యక్తులు

పులివెందుల రూరల్ : పూర్వం నుంచి ఆచారంగా వస్తున్న పద్ధతులు కనుమరుగైపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో కొంతమంది పట్టణాలలో గాడిదలను పట్టుకుని గాడిద పాలు అమ్ముతూ వీధులలో తిరుగుతున్నారు. ఈ గాడిద పాలు తాపడంవల్ల తెలివితేటలు పెరగడంతో పాటు దగ్గు, ఉబ్బసం, ఆయాసం వంటి వ్యాధులు దరిచేరవనేవారు. ఒకప్పుడు చాకలి వారు గాడిద వీపుపై గుడ్డల మోపులు వేసుకుని వచ్చేవారు. అప్పుడు వారిని అడిగితే గాడిదపాలు తెచ్చిస్తుండేవారు.

పులివెందులలో అస్త వ్యస్తంగా ట్రాఫిక్


శ్రీరామాహాలు రోడ్డులో ఆగిన బస్సు, ఆటోలు


బోలేవార్డులో ఆగిన ప్రవేట్ బస్సు

పులివెందుల రూరల్ : పట్టణంలో ఎక్కడ చూసినా రోడ్లపై ప్రవేట్ బస్సులు నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. పట్టణంలోని పాత శ్రీరామాహాలు రోడ్డు, పార్నపల్లె రోడ్డు, బోలో వార్డు, ముద్దనూరు రోడ్డు, పూలఅంగళ్ల సర్కిల్ తదితర ప్రాంతాలలో ఎప్పుడు ప్రవేట్ బస్సులు రోడ్లలపైన ఆపడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే లారీలు పట్టణంలోకి రావడంతో మరింత జఠిలమవుతోందన్నారు. కదిరి రోడ్డు, కడప రోడ్డు ప్రాంతాలలో అరటి కాయల లారీలు పగలు రాత్రి సమయాల్లో రోడ్లపైన ఉంచడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. చిన్న పిల్లలు ద్విచక్ర వాహనాలను రికార్డులు లేకుండా ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దుకాణాల ముందు వాహనాలు లేకుండా పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.